

రోగిని సాధారణ స్థితికి తీసుకువచ్చిన కేర్ ఆసుపత్రి వైద్యులు

రోగికి కేర్ ఆస్పత్రి వైద్యుల పునరుజ్జీవం

బంజారాహిల్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పలుమార్లు గుండెపోటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చేరిన వృద్ధురాలైన మహిళకు(68) కేర్ ఆసుపత్రి వైద్యులు పునరుజ్జీవం అందించారు. అతి బలహీనంగా ఉన్న గుండె పనితీరును సరిచేయటంతోపాటు అవసరమైన అధునాతన వైద్య చికిత్స అందించటం ద్వారా రోగి ప్రాణాలను నిలబెట్టారు. బహుళ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నగరానికి చెందిన మహిళా రోగి నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక్కసారిగా తీవ్రమైన హృద్రోగానికి గురయ్యారు. దీంతో ఆమె కుటుంబసభ్యులు బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు డాక్టర్ వి.సూర్యప్రకాష్‌రావు, వారి వైద్య బృందం రోగి గుండె పనితీరును పరీక్షించి, గుండె కేవలం 25శాతం మాత్రమే రక్తాన్ని సరఫరా చేస్తుందని అంచనా వేశారు. అంతేకాక ప్రాణాంతక అరిథ్మియా వల్ల వెంట్రిక్యులర్ టాకీకార్డియా (వీటీ), వెంట్రిక్యులర్ ఫైబ్రిలేషన్(విఎఫ్) ఇబ్బందులతో రోగి ప్రాణాపాయస్థితిలో ఉన్నట్టు గుర్తించారు. సిఆర్‌టి-డి అధునాతన పరికరం ద్వారా రోగి ఆరోగ్యస్థితిని సాధారణ స్థాయికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రోగి గుండె స్థితిని స్థిరీకరించటంలో, ఆమె కోలుకునేలా చేయడంతో ఆస్పత్రి వివిధ విభాగాల వైద్య బృందం సమన్వయంతో పనిచేసిందని తెలిపారు. కేర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ అజిత్‌సింగ్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలోని రోగికి విజయవంతంగా వైద్య చికిత్స అందించటంలో వైద్యులు నైపుణ్యం ఉందన్నారు.

5న ఖైరతాబాద్‌లో ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

ఖైరతాబాద్, జనవరి2(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ప్రిలిమినరీ పోటీలు ఈనెల 5వ తేదీన ఖైరతాబాద్‌లో జరగనున్నాయి. ఐమాక్స్ మల్టీప్లెక్స్ ఎదురుగా ఉన్న సరస్వతీ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ముగ్గుల పోటీలు జరగనున్నాయి. మొదటి బహుమతిగా రూ.6వేలు, రెండవ బహుమతిగా రూ.4వేలు, మూడవ బహుమతిగా రూ.3వేలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. ఈ పోటీల్లో విజేతలైన వారి నుండి జిల్లా తరపున ఫైనల్ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. మహిళలు, యువతులు పోటీల్లో పాల్గొనవచ్చు. పాల్గొనాలనుకునే వారు తమ పేర్లను మొబైల్ నెంబర్లు 9848297464, 9393010164లో సంప్రదించవచ్చు.



విద్యార్థులకు క్రీడా వస్తువులను అందజేస్తున్న కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం : ఫసియుద్దీన్

బోరబండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో రాణిస్తున్న క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇస్తున్నదని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు సైట్-5 పీజేఆర్ క్రీడా మైదానంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన బాబాఫసియుద్దీన్ గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో ఆస్ట్రేలియా తరహాలో ప్రతి జిల్లాకు స్పోర్ట్స్ యూనివర్సిటీని ముఖ్యమంత్రి ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అజీజ్‌బేగ్, ఆనంద్‌కుమార్, కె.మహేష్ గౌడ్, వెంకటేష్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్-19 డిఎంసీ జకియా సుల్తానాతో ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై చర్చిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలి

యూసుఫ్‌గూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్‌నగర్ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం నిర్వహించారు. ఈ సర్వేను పరిశీలించిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని అధికారులకు సూచించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్-19 డీఎంసీ జకియా సుల్తానాతో సమావేశమై ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల సర్వేను వేగంగా పూర్తిచేయాలని పారదర్శకంగా జరగాలని కోరారు.

'షియా'లకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాల్సిందే

ఖైరతాబాద్,జనవరి2 (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం ముస్లిం వర్గాల్లో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనకబడ్డ షియా ముస్లింలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాల్సిందేనని రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిందని న్యాయవాది వెంకటరఘు మల్లేపల్లి అన్నారు. గురువారం లక్డీకాపూల్‌లోని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గురువారం హైకోర్టులో వచ్చిన ఉత్తర్వులను వెల్లడిస్తూ మాట్లాడారు. ప్రభుత్వం షియా ముస్లింల నుండి ఎమ్మెల్సీగా లక్షలాది మంది ప్రపోజ్ చేసిన వ్యక్తిని ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని గవర్నర్‌కు రికమండ్ చేయాలని కేసును మూసివేసిందని తెలిపారు.

క్రీడలు, చదువుల్లో వీరే టాప్

- జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న విద్యార్థులు
- గురుకుల బాలుర పాఠశాలకు పతకాల పంట



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమణమ్మ (ఫైల్)

బోరబండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మైదానంలో దిగినా.. పుస్తకం పట్టుకున్నా తమదైన శైలితో వీరు రాణిస్తారు. ప్రైవేటు విద్యార్థులకు దీటుగా నిలబడి శభాష్ అనిపించుకుంటున్నారు. ఓ వైపు చదువులో తమ ప్రతిభను కనబరుస్తూ మరో వైపు క్రీడల్లో పతకాలను కొల్లగొడుతున్నారు. ఇప్పుడు అందరి దృష్టిని బోరబండ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు ఆకర్షిస్తున్నారు. ఓ వైపు చదువుతూ మరో వైపు క్రీడల్లో రాణిస్తున్న వారి సంఖ్య పాఠశాలలో 100కు పైగానే ఉంటుందంటే అతిశయోక్తి కాదు. జోనల్, సబ్ జూనియర్, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఈ పాఠశాల విద్యార్థులు సాధించిన గోల్డ్, సిల్వర్, బ్రౌన్స్ పతకాలు పాఠశాల గుర్తింపు పెంచుతున్నాయి.

విశాలమైన మైదానం ప్రత్యేక శిక్షణ

పేద విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని విద్యాశాఖ భావించింది. ఇందుకు అనుగుణంగా ఉండే ప్రాంతాన్ని ఎంచుకోవాలని అధికారులు భావించారు. ఈ మేరకు బోరబండలో ఖాళీగా ఉన్న అరఎకరం స్థలంలో గురుకుల బాలుర పాఠశాలను ఏర్పాటు చేయాలని భావించారు. శంకుస్థాపన పూర్తవ్వడంతో పాటు నిర్మాణ పనులు కూడా వేగంగా పూర్తవ్వడంతో అన్ని వసతులతో పాఠశాల సిద్ధం అయింది. తరగతి గదుల్లో విద్యా బోధన మొదలైన కొద్ది రోజులకే విద్యార్థులు క్రీడల్లో రాణించేలా విశాలమైన మైదానాన్ని సిద్ధం చేశారు. వాలీబాల్, క్రికెట్, కోకో, కబడ్డి ఇలాంటి క్రీడలకు అనువుగా తీర్చిదిద్దారు. దీనికి తోడు ప్రత్యేకమైన శిక్షణ క్రీడాకారులైన పీఈటీలను నియమించారు. ఉదయం 5నుంచి 6 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు విద్యార్థులకు వారి అభిరుచి మేరకు ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నారు. ఈ పాఠశాల నుంచి 100 మందికి పైగా వివిధ స్థాయిల్లో పలు ఆటల్లో పాల్గొన్న క్రీడాకారులు బహుమతులు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన వాలీబాల్ అండర్-16, సబ్ జూనియర్, సీఎం కప్, జోనల్‌స్థాయి, స్కూల్‌స్థాయి, జిల్లా స్థాయిలల్లో విజయం సాధించారు. కబడ్డీలో అండర్-16 జట్టు జాతీయస్థాయిలో ఫైనల్స్ వరకు వెళ్లింది. వ్యక్తిగత విభాగంలో విద్యార్థులు రాణిస్తున్నారు. బాడ్మింటన్‌లో ఓ విద్యార్థిని పలు విభాగాల్లో నాలుగు బహుమతులను కైవసం చేసుకుంది.

చదువులో టాప్

ఇక్కడి విద్యార్థులు క్రీడాల్లోనే కాదు.. చదువులో కూడా టాప్‌లోనే ఉన్నారు. ఈ పాఠశాలల్లో 2022 బ్యాచ్‌కంటే ముందు పదో తరగతి చదివిన విద్యార్థులు గత కొన్ని సంవత్సరాలుగా 100% ఉత్తీర్ణత సాధించారు. విదార్థుల పట్ల ఉపాధ్యాయుల శ్రద్ధ, నిరంతరం ప్రధానోపాధ్యాయురాలి పర్యవేక్షణ ఫలితంగా విద్యార్థులు ఆటల్లో సాధిస్తున్న విజయాలు, పదో తరగతిలో సాధిస్తున్న 10 జీపీఎలే ఇందుకు నిదర్శనం.

ఆటలు ఉత్సాహాన్నిస్తాయి



ఆటలు క్రీడాకారుల్లో శారీరక ఉత్సాహాన్ని నింపుతాయి. అదే విద్యార్థులను చదువులో రాణించేలా చేస్తుంది. ఆరోగ్యమే మహాభాగ్యమంటారు. ఆ ఆరోగ్యం క్రీడలతోనే వస్తుంది. మా పాఠశాలల్లో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 6గంటల వరకు యోగ నిర్వహిస్తాం. సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు విద్యార్థికి ఇష్టమైన ఆటలో శిక్షణ ఉంటుంది.

- జి.రమణమ్మ, హెచ్‌ఎం గురుకుల బాలుర పాఠశాల, బోరబండ

తాత స్ఫూర్తితో ఆడుతున్న



తాత ఆర్మీ ఉద్యోగి, నాన బాక్సింగ్ ఆటగాడు. వారి ఇద్దరి స్ఫూర్తితో నేను ఆటలాడుతున్న. ఇప్పటికి జోనల్, సబ్ జూనియర్, జిల్లా స్థాయిల్లో ఆటలు ఆడి రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో ఎంపికయ్యా. వివిధ స్థాయిల్లో ఆడి గెలిచినందుకు గోల్డ్, సిల్వర్, బ్రౌన్స్ మెడల్స్‌ను సాధించా.

కె. రాంరెడ్డి, ఖోఖో క్రీడాకారుడు

జాతీయస్థాయిలో రాణించాలనేదే లక్ష్యం



పలు విభాల్లో ఆడి రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ పేరుతో జరిగే ఆటలకు ఎంపికయ్యా. నేషనల్‌లో ఆడాలనే లక్ష్యంతో ప్రతి ఆటలో కసితో ఆడి గెలుస్తున్న. ఆట ఆడేవారికి విద్య, ఉపాధి కల్పనలో ప్రత్యేక రాయితీ ఉంది.

- డి.నందు, కబడ్డీ క్రీడాకారుడు

అన్న ప్రోత్సాహంతో ఆడుతున్న



అన్న కబడ్డీ ఆటగాడు. నేను క్రీడల్లో రాణించడానికి గురువులు, అన్న ప్రోత్సాహం ఉంది. పాఠశాలల్లో విశాలమైన క్రీడామైదానం, పీఈటీ సార్ శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడింది.

- గణేష్, వాలీబాల్ క్రీడాకారుడు

శిక్షణతోనే ఆటల్లో రాణిస్తున్నా



ఉపాధ్యాయుల ప్రత్యేకమైన శ్రద్ధ, నిరంతర శిక్షణ తోనే నేను, నా స్నేహితులు ఆటల్లో రాణిస్తున్నాం. మేము పాల్గొన్న ప్రతి క్రీడలో గెలుపొందేలా హెచ్‌ఎం ప్రోత్సాహం గ్యారంటీగా గెలిచేలా చేస్తున్నాయి.

- జశ్వంత్-ఫుట్‌బాల్ క్రీడాకారుడు

బీడీ పరిశ్రమపై ఆంక్షలు వద్దు

- కేంద్రం తెచ్చిన జీఎస్ఆర్ 226 ను తొలగించాలి
- బీఎంఎస్ జాతీయ కార్యదర్శి సురేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న బీఎంఎస్ జాతీయ కార్యదర్శి బి.సురేంద్రన్

పంజాగుట్ట, జనవరి2 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే వరకు పరిశ్రమపై ఎలాంటి ఆంక్షలు విధించ వద్దని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)అఖిల భారత సంఘటన్ జాతీయ కార్యదర్శి బి.సురేంద్రన్ డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశం, రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, అఖిల భారతీయ బీడీ మజ్దూర్ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.సుధీర్ కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాల వలన బీడీ కార్మికులు, బీడీ కర్మాగారాలు ఎన్నో రకాల కష్టాలను ఎదుర్కొంటున్నాయని అన్నారు. దేశంలో సుమారు నాలుగు కోట్ల మందికి పరిశ్రమ ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. అన్ని పొగాకు ఉత్పత్తులనుండి బీడీ పరిశ్రమను మినహాయించాలని, పరిశ్రమను సీజనల్ పరిశ్రమగా గుర్తించాలని కోరారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తోన్న నకిలీ బీడీ పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికుల కోసం డిస్పెన్సరీలు, మొబైల్ డిస్పెన్సరీలు మరిన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం 2015లో తెచ్చిన జీఎస్ఆర్ 226 నిబంధనను తొలగించి, పాత పద్ధతిలో పదేళ్ల పూర్తిచేసిన కార్మికులకు పెన్షన్, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. వెయ్యి బీడీలు చుడితే ప్రస్తుతం రూ.250 ఇస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రూ.300 ఇస్తామని, ఆసరా పింఛన్ రూ.2వేలనుంచి రూ. 4వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు ఎనిమిది లక్షల మందికి పైగా బీడీ చుట్టే కార్మికులు ఉన్నారని తెలిపారు. ఆరోగ్యానికి హానికరం పేరుతో కార్మికులకు ప్రత్యామ్నాయ మార్గం చూపించకుండా బీడీ పరిశ్రమను మూసి వేయవద్దు, ఆంక్షలు పెట్టవద్దని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.రాం రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి జె. రామ్మోహన్, నాయకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆత్మహత్య



మృతుడు ధర్మ

బంజారాహిల్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఉరేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడకి చెందిన ధర్మ(35) సినిమా షూటింగ్‌లలో ఆర్ట్ డెకరేషన్ చేస్తుంటాడు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆరోజు అంతా మద్యం తాగాడు. మరుసటి రోజు రాత్రి మళ్లీ వరుసకు బావమరిది అయ్యే దుర్గ అనే వ్యక్తితో కలిసి మద్యం తాగుతూ అతడితో గొడవ పడ్డాడు. అర్ధరాత్రి దాటాక మరోసారి గొడవపడ్డాడు. ఆ తరువాత చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. ఇంటి యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



గాయత్రి

బోరబండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వివరాల ప్రకారం.. మోహిదీపట్నంకి చెందిన గాయత్రి (23) భర్త శివకుమార్‌తో కలిసి డిసెంబరు 31న బోరబండ సైట్-3లోని తల్లి ఇంటికి వచ్చారు. అదే రోజు రాత్రి బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లిన ఆమె తిరిగిరాకపోవడంతో తండ్రి వెంకటస్వామి గురువారం బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

బోరబండలో బాలిక..

బోరబండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నాగుల్‌మీరా వివరాల ప్రకారం.. బోరబండ బాబాసైలానీ నగర్‌కు చెందిన ఓ బాలిక (17) తొమ్మిదవ తరగతి చదువుతుంది. డిసెంబర్ 31న సాయంత్రం ఇంటినుండి మార్కెట్‌కు వెళ్లింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇండ్లల్లో ఆరాతీసినా ఆచూకీ లభించకపోవడం తో బాలిక తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కెవి ఏజీ కాలనీ, శబ్దాలయ ఫీడర్ల పరిధిలోని ఏజీ కాలని, సిద్ధార్థ నగర్, వికాస్ పురికాలనీ, ఈఎస్ఐ, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2, 3 యూబీఐ కాలనీ, పేజ్‌కాలేజీ లైన్, లుంబినీ మాల్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు రహమత్‌నగర్, యాదగిరి నగర్, లుంబిని మాల్, సాగర్ సొసైటీ, ప్రాంతాలు.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కెవి కార్మికనగర్, బేగంపేట మయూరి మార్గ్ ఫీడర్ల పరిధిలోని కార్మికనగర్, బ్రహ్మశంకర్ నగర్, మయూరిమార్గ్, అల్లంతోట బావి, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు 11 కెవి సూర్యోదయ కాంప్లెక్స్ బేగంపేట సెలెబ్రిటీ క్లబ్, శ్రీముఖి అపార్ట్‌మెంట్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.



సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో ఎల్లారెడ్డిగూడ హనుమాన్ దేవాలయం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వి.ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు

హనుమాన్ ఆలయ చైర్మన్‌గా ఉమామహేశ్వరరావు

బంజారాహిల్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సోమాజీగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలోని శ్రీహనుమాన్ దేవస్థానం చైర్మన్‌గా వి.ఉమామహేశ్వరావు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో దేవాలయం చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానికులు గుంటి శ్రీనివాస్‌యాదవ్, సంతోష్‌కుమార్ గౌడ్, శరత్‌గౌడ్, మనోజ్‌యాదవ్, కిరణ్‌యాదవ్, ఆలయ ఈఓ విట్టలయ్య, పూజారి శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్ డివిజన్ వినాయక్‌నగర్‌లో రూ.9.40 లక్షలతో సీవరేజ్ పైప్‌లైన్ పనులకు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

- యూసుఫ్‌గూడ, (ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల విస్తరణ



శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు, కిట్స్ అందజేస్తున్న కేవీఐసీ చైర్మన్ మనోజ్‌కుమార్

యూసుఫ్‌గూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో న్యూ ఖాదీ ఆఫ్ న్యూ ఇండియా కొత్త నమూనాను ఏర్పాటు చేస్తున్నట్లు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ మనోజ్‌కుమార్ తెలిపారు. గురువారం యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మే) కేంద్ర శిక్షణా సంస్థ ప్రాంగణంలో కేవీఐఎస్ ఆధ్వర్యంలో ఖాదీ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మనోజ్‌కుమార్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ మార్గదర్శకత్వంలో కొనత్త నమూనాతో పాటుగా వోకల్ ఫర్ లోకల్, ఆత్మనిర్భర్ భారత్ ప్రచారాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు ఉద్యమంలా మారి దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయన్నారు. గ్రామోద్యోగ్ వికాస్ పథకం కింద నిరుద్యోగులకు వీల్‌పాటరీ, సెల్‌ఫోన్ రిపేర్ తదితర చేతి వృత్తులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. గత నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో 2,370 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఆయా వృత్తుల నైపుణ్యం పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లతో పాటుగా 2,644మందికి కిట్స్ కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన ఆయా సర్టిఫికెట్ల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారాలు చేస్తూ ఉన్నతస్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. బ్యాంకుల్లో సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేయాలని ప్రధాని మోడీ ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు తెలియచేశారని మనోజ్‌కుమార్ తెలిపారు. పురుషులతోపాటుగా మహిళలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. అనంతరం వారికి సర్టిఫికెట్లు, కిట్లు అందచేశారు. కార్యక్రమంలో నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప, కేవీఐసీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత సిగరెట్లను విక్రయిస్తే చర్యలు : సీఐ



ఎస్‌వి శేఖర్, బోరబండ సీఐ

బోరబండ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నిషేధించిన సిగరెట్లను పాన్‌షాపుల్లో విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని బోరబండ సీఐ ఎస్‌వి శేఖర్ హెచ్చరించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత 10 రోజులుగా బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాన్‌షాపుల్లో సిబ్బందితో కలసి విస్తృతంగా దాడులు చేస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్యాన్ని పాడు చేస్తున్న ఈ సిగరెట్లను నిషేధించారని, వీటిని విక్రయిస్తున్న 15 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. పాన్ షాపులపై దాడులు కొనసాగుతూనే ఉంటాయని సీఐ వివరించారు.

హ్యాపీ న్యూ ఇయర్...



సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, ఆరీఫ్, శ్రీనివాస్

- బేగంపేట, (ఆంధ్రజ్యోతి)



బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవి గౌడ్, నాయకులు నరేష్ గౌడ్, సత్యనారాయణ, హనుమంతు, యాకమ్మ, సుధాకుమారి, సుజాత

- ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి

క్యాలెండర్ ఆవిష్కరణ...



జలసౌధలో గురువారం ఇరిగేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఇంజనీర్ ఇన్‌చీఫ్ జి.అనిల్ కుమార్, విజిలెన్స్ ఈఈ శారద. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రెసిడెంట్ జమీర్ పాష, జనరల్ సెక్రటరీ మహ్మద్ గౌస్, అడ్వైజర్ అజ్మల్ ఖాన్, ఉద్యోగులు పాల్గొన్నారు. - హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)



హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సి.శ్రీనివాసరావు, చిత్రంలో చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మూడే రవి నాయక్, తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 రాష్ట్ర అధ్యక్షులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, బండారి నాగేష్, ఆనంద్ కుమార్, శైలజ

- ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి

ఈ రోడ్డుపై ప్రయాణించేదెలా.?

- కంటోన్మెంట్ 6వ వార్డులో రోడ్డుపై గుంతలు, తేలిన కంకర
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డులోని ఓ పాఠశాల ఎదుట కంకర తేలిన రోడ్డు



సీతారాంపురం వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలు, తెలిన కంకర

బోయిన్‌పల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు పరిధిలోని వీఆర్ ఆస్పత్రి నుంచి సీఎంఆర్ పాఠశాల మీదుగా మర్రి రాంరెడ్డి కాలనీ వరకు ఉన్న రోడ్డు పూర్తిగా కంకరతేలి అధ్వాన్నంగా మారింది. రహదారి మొత్తం గోతులు, దుమ్ము, ధూళితో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డు దెబ్బతిని సంవత్సరాలు గడుస్తున్నా, స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు మరమ్మతులకు చొరవ చూపడంలేదు.

ఈ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి, మర్రి రాంరెడ్డికాలనీ, సీతారాంపురం, భవానీనగర్, సాయిబాబా కాలనీ ప్రజలు, సెయింట్ పీటర్‌స్కూల్, సాయి మోడల్ స్కూల్, వాణీ కాన్వెంట్ స్కూల్‌తో పాటు వివిధ పాఠశాలలకు వెళ్లేందుకు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ రోడ్డే దిక్కు. ఈ రోడ్డుపై కంకర తేలడంతో అంబులెన్స్‌లు, ఆటోలు, స్కూల్ బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లే ద్విచక్రవాహన దారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. స్థానిక నేతలు కొత్తరోడ్డు వేస్తామని హామీలు ఇస్తున్నారే తప్ప రోడ్డుకు మరమ్మతులు చేయడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నూతజూ రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్వాసకోశ సమస్యలతో..



ముందు వాహనం వెళ్తే వెనుకవెళ్లలేనంతగా దుమ్ములేస్తోంది. రహదారి గుంతలమయం అవడం, దుమ్ము, ధూళి వల్ల వాహనదారులు శ్వాసకోశ సమస్యలు, నడుము నొప్పులతో బాధపడుతున్నారు.

- పుష్పలత, స్థానికురాలు

ఈ ప్రాంతంలోని ఏ రోడ్డు చూసినా..



విద్యార్థులు పాఠశాలలకు, రోగులు ఆస్పత్రులకు వెళ్లేందకు ఇదేదారి. కానీ, ఈ రోడ్డు ధ్వంసమవ్వడంతో ప్రయాణం కష్టంగా మారింది. ఈ ప్రాంతంలోని ఏ రోడ్డు చూసినా కంకరతేలి, గుంతలుపడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లను కడిగిన నీటిని బయటకు వదలడంతో రోడ్లు చిన్న కుంటలను తలపిస్తున్నాయి. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- కె.దాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు



నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న జడ్జిలు, న్యాయవాదులు

సికింద్రాబాద్ కోర్టులో నూతన సంవత్సర వేడుకలు

అడ్డగుట్ట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సివిల్ కోర్టులో గురువారం రాత్రి కేక్ కట్‌చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సికింద్రాబాద్ సివిల్ కోర్టు మొదటి అదనపు చీఫ్ జడ్జి ఎ.వీరయ్య, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి సరిత, సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్‌కుమార్, కార్యదర్శి రమణ, ప్రధాన కార్యదర్శి సుశీలతో పాటు పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేతలకు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, పండితులు

మారేడుపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మారేడుపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను పలువురు కార్పొరేటర్లు, అధికారులు, పార్టీ నాయకులు, అభిమానులు, వివిధ బస్తీ కమిటీ సభ్యులు కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బేగంపేట, బన్సీలాల్‌పేట కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, డీజీఎం వంశీ, బీఆర్ఎస్ నాయకులు హన్మంతారావు, వెంకటేషన్ రాజు, మహేష్, లక్ష్మీపతి, శ్రీహరి, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్ తదితరులు తలసానిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బల్కంపేట దేవాలయ పండితులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన కార్యాలంలో కలిసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్ ఎమ్మెల్యేకు ప్రసాదాలు అందజేశారు.

● స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు..



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మినిస్టర్ క్వార్టర్స్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ 'ఏ' బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్.

- రాంగోపాల్‌పేట్ జనవరి 2 (ఆంధ్రజ్యోతి)

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు..



మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత కార్యకర్తలతో ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిసి జ్ఞాపికను అందజేశారు.

- చిలకలగూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి)

● రైల్వే డిప్యూటీ సీఏఓకు..



దక్షిణమధ్యరైల్వే మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచి కార్యదర్శి చింతకుంట రామకృష్ణ కార్యవర్గ సభ్యులతో సికింద్రాబాద్ రైల్ నిలయంలో డిప్యూటీ సీఏఓ(జీ) దివాకర్‌ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- చిలకలగూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి)

● క్యాలెండర్ ఆవిష్కరణ



పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంకీ రవీందర్, ముప్పిడి మధుకర్, శ్రీరామానంద్, సి.సంతోష్ యాదవ్, సాంసంగ్ రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, నాగేష్ యాదవ్, టెంట్‌హౌస్ భాస్కర్, శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

- మారేడుపల్లి జనవరి 2(ఆంధ్రజ్యోతి)

● వారాసిగూడ గంగపుత్ర సంఘం క్యాలెండర్..



వారాసిగూడలో గంగపుత్ర సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.రాజలింగం, కార్యదర్శి వై.మల్లేష్, కోశాధికారి ఎం.గణేశ్, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, నాయకులు కొమరయ్య, గాలేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

- బౌద్ధనగర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి)

ప్రధాని నేతృత్వంలో న్యూ ఖాదీ ఆఫ్ న్యూ ఇండియా నమూనా



చేతి వృత్తులలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు, కిట్స్ అందజేస్తున్న కేవీఐసీ చైర్మన్ మనోజ్‌కుమార్

యూసుఫ్‌గూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో న్యూ ఖాదీ ఆఫ్ న్యూ ఇండియా కొత్త నమూనాను ఏర్పాటు చేస్తున్నట్లు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ మనోజ్‌కుమార్ తెలిపారు. గురువారం యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మే) కేంద్ర శిక్షణా సంస్థ ప్రాంగణంలో కేవీఐఎస్ ఆధ్వర్యంలో ఖాదీ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మనోజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ మార్గదర్శకత్వంలో కొత్త నమూనాతో పాటుగా వోకల్ ఫర్ లోకల్, ఆత్మనిర్భర్ భారత్ ప్రచారాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు ఉద్యమంలా మారి దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయన్నారు. గ్రామోద్యోగ్ వికాస్ పథకం కింద నిరుద్యోగులకు వీల్‌పాటరీ, సెల్‌ఫోన్ రిపేర్ తదితర చేతి వృత్తులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. గత నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో 2,370మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఆయా వృత్తుల నైపుణ్యం పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లతో పాటుగా 2,644మందికి కిట్స్ కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన ఆయా సర్టిఫికెట్ల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారాలు చేస్తూ ఉన్నతస్థితికి ఎదగాలని సూచించారు. సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేయాలని ప్రధాని మోదీ ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులను ఆదేశించారని మనోజ్‌కుమార్ తెలిపారు. పురుషులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు తయారు చేసిన వస్తువులను ఆయన పరిశీలించి అభినందించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప, కేవీఐసీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపదలో కొంత సామాజిక సేవకు వినియోగించాలి



పిల్లలకు చిల్డ్రన్ స్టడీ టేబుల్స్ అందజేస్తున్న జీవన్‌లాల్, సామల వేణు తదితరులు

పద్మారావునగర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సంపదలో కొంత సామాజిక సేవకు వినియోగించాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇన్‌కం టాక్స్ కమిషన్ జీవన్‌లాల్ విదియ సూచించారు. బన్సీలాల్‌పేట డివిజన్ పద్మారావునగర్ పార్కులో గురువారం రాధే రాధే గ్రూపు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం అర్హులైన వారికి చిల్డ్రన్ స్టడీ టేబుల్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మెజీషియన్ సామాల వేణుతో కలిసి జీవన్‌లాల్ విదియ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్‌జే ఇన్స్పిరేషన్ హ్యాండ్స్ చైర్మన్ ఉమా కార్తీక్, యాంకర్ శిల్పిక లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ బాలాజీ, మనోహర్‌రెడ్డి, వేలు కుమార్, సతీష్, రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో 50 శాతం డైరెక్టర్ పోస్టులు బీసీలకే ఇవ్వాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

బర్కత్‌పుర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకాలలో 50 శాతం పోస్టులను బీసీ అధికారులచే భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలలో 24 డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని, వాటిలో 12 పోస్టులను బీసీ అధికారులకే కేటాయించాలన్నారు. గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.కుమారస్వామి, ముత్యం వెంకన్నగౌడ్‌ల ఆధ్వర్యంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 8న విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహిస్తున్న విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ సంస్థల్లో సుమారు 24 వేల మంది ఉద్యోగులను ఆర్టిజన్లుగా కొనసాగిస్తున్నారని, వీరికి అర్హతల మేరకు ప్రభుత్వం తక్షణమే పదోన్నతులు కల్పించాలన్నారు. 2014 జూన్ 2 తర్వాత ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.కుమారస్వామి, ముత్యం వెంకన్నగౌడ్ మాట్లాడుతూ బీసీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఫిబ్రవరిలో నిరవధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నెల 8న నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎంపీ ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్, ఎం.అశోక్‌కుమార్, డాక్టర్ చంద్రుడు, బ్రహ్మేందర్‌రావు, యాదగిరి, రాజేందర్, సదానందం, శివాజీ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి మహావీర్ ఇంటర్నేషనల్ అఫెక్స్ స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఫెక్స్ సంస్థ ప్రతినిధులు

బర్కత్‌పుర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మహావీర్ ఇంటర్నేషనల్ అఫెక్స్ సంస్థ స్వర్ణోత్సవాలు ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చీఫ్ కన్వీనర్లు శీల్ జైన్, అజయ్ సహత, చైర్మన్ వినోద్ సంచేటి, వైస్ చైర్‌పర్సన్ అర్చన సహత, కన్వీనర్ సీమ షీల్‌కుమార్ జైన్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో స్వర్ణోత్సవ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. శంషాబాద్‌లోని సిటాడెల్ కన్వెన్షన్‌లో జరగనున్న వేడుకలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ స్వర్ణోత్సవాల సందర్భంగా సంస్థ హైదరాబాద్ ఛాప్టర్ రజతోత్సవ వేడుకలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 800 మంది ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 350 కేంద్రాలు 12వేల మంది సభ్యులు తమ సంస్థలో కొనసాగుతున్నారని తెలిపారు. విద్యా, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ తమ సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.

నక్షత్రరాజు గీతా పరిచయం

చిక్కడపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలోని పాత్రలు ఆధునిక కాలంలోనూ తటస్థపడతాయని డా. వేంకట నక్షత్రరాజు(అమెరికా) అన్నారు. వంశీ ఇంటర్నేషనల్(అమెరికా) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో అమెరికాలో స్థిరపడ్డ డా. వేంకట నక్షత్రరాజు గీతా పరిచయ ప్రసంగం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ నక్షత్రరాజు అమెరికాలో తన వృత్తిలో ఉండి కూడా దేశ సంస్కృతిలో భాగం అయిన మహాభారతంలోని గీతను సామాజిక దృక్కోణంలో అర్థం చేసుకుని ప్రసంగాలు చేయడం విశేషం అన్నారు. వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నక్షత్రరాజుకు ప్రవాస భారతీయ వంశీ గ్లోబల్ అవార్డును బహూకరించారు.



వేంకట నక్షత్రరాజును సన్మానిస్తున్న ఓలేటి పార్వతీశం, రామరాజు

రేపటి నుంచి హరిహర కళాభవన్‌లో మ్యాజిక్ షోలు

- పోరుష్ చంద్ర సర్కార్



సమావేశంలో మాట్లాడుతున్న పి.సి.సర్కార్

హరిహరకళాభవన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఈనెల 4 నుంచి 19వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 2గంటలకు, రాత్రి 7గంటలకు రెండు మ్యాజిక్ షోలు నిర్వహిస్తున్నట్లు ప్రఖ్యాత మెజీషియన్ పోరుష్ చంద్ర సర్కార్ (పి.సి.సర్కార్) తెలిపారు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాతి సెలవుల్లో ప్రత్యేక ప్రదర్శనలకు 10మంది కళాకారులతో వినోదాత్మక, సందేశాత్మక అంశాలతో ప్రదర్శనలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పాఠశాల విద్యార్థులు తమ ఐడెంటిటీ కార్డుతో తగ్గింపు ధరలతో ప్రదర్శనలు తిలకించవచ్చునని తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ శేణులు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మారేడుపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలోని జూబ్లీబస్టాండ్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ సర్కిల్ నుంచి మేడ్చల్ వరకు మెట్రోరైలు మార్గం పొడగింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడం పట్ల కాంగ్రెస్ పార్టీ శేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు గురువారం పికెట్ జేబీఎస్ చౌరస్తాలోని వీజేఆర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ శేణులు క్షీరాభిషేకం చేశాయి. నాయకులు సాంసన్ రాజు, ముప్పిడి మధుకర్, రేపల్లె వెంకటేశ్వర్లు, సంకీ రవిందర్, సంతోష్ యాదవ్, రాజు, నరసింహ, ఆనంద్, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

షియా ముస్లింలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రఘు

ఖైరతాబాద్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం ముస్లిం వర్గాల్లో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనకబడ్డ షియా ముస్లింలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిందని న్యాయవాది వెంకట రఘు మల్లేపల్లి తెలిపారు. గురువారం లక్డీకాపూల్‌లోని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు వివరాలను వెల్లడించారు. ప్రభుత్వం షియా ముస్లింల నుంచి ఎమ్మెల్సీగా లక్షలాది మంది ప్రపోజ్ చేసిన వ్యక్తిని నామినేట్ చేయాలని గవర్నర్‌కు రికమండ్ చేయాలని కేసును మూసివేసిందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీగా నామినేట్ అయిన మహమ్మద్ అలీ హైదర్, నిర్వాహక సంస్థ అధ్యక్షుడు ముస్తాక్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు సయ్యద్ అస్గర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై బీఆర్ఎస్‌ది కపట ప్రేమ : టీపీసీసీ



గాంధీ భవన్‌లో మాట్లాడుతున్న గౌరి సతీష్

అఫ్జల్‌గంజ్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పుడు వారి పట్ల కపట ప్రేమ చూపిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ విమర్శించారు. గురువారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ స్థానికసంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించిందని ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్‌రావు పోలీస్ వ్యవస్థను చిన్నచూపు చూసేలా మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతలను బీహార్‌తో పోల్చడం సరికాదని పేర్కొన్నారు.

మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో మృతిచెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని(55) వ్యక్తి చనిపోయడనే సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సప్రదించాలని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.